వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



వైఎస్సార్‌సీపీ కార్యకర్తను పరామర్శిస్తున్న పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో నివాసం ఉంటున్న పాంగి పులిరాజు అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్త అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న అరకు ఎంపీ గుమ్మ తనూజరాణి భర్త, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ శుక్రవారం పరామర్శించారు.అనారోగ్యానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటించాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ నిరంతరం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వైఎస్సార్‌సీపీ పార్టీలో కార్యకర్తలకు అన్ని విధాలుగా సాయ సహకారాలు అందిస్తామని, ఆధైర్య పడవద్దన్నారు. వైస్ ఎంపీపీ భాగ్యవతి, పెదబయలు జెడ్పీటీసీ సభ్యులు బొంజుబాబు, సర్పంచులు రమేష్, సురేష్, బాబూరావు, నాయకులు సూర్యనారాయణ, జయదేవ్, అప్పారావు, మత్స్యలింగం, గాసిరావు, దాసు, దేవా, గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

చింతపల్లి: మండలంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జాతీయ గిరిజన ఉద్యోగులు సంఘం చింతపల్లి మండల అధ్యక్షుడు బౌడ గంగరాజు కోరారు.ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు.ప్ర తి ఏడాది సబ్ డివిజన్ పరిధిలో గిరిజన ఆదివాసీ దినోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గిరిజన చట్టాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునే విధంగా గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆదివాసీలు శత శాతం ఉద్యోగాలు సాధించడానికి, జీఓ నెం-3 రద్దుకు సంబంధించి కార్యాచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ దుమ్మంతి సత్యనారాయణ, నాయకులు నవభరత్, గిరి, శశికుమార్, మోహన్, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



వనభరంగిపాడులో మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: మండలంలో సొలభం, నుర్మతి పంచాయతీల్లో ఎస్.కొత్తూరు, వీవో పరిధిలో వనభరంగిపాడు, ఎస్.కొత్తూరు గ్రామాల్లో గల వీడీవీకే కేంద్రాల్లోని ఐటీడీఏ, వెలుగు అధ్వర్యంలో ఆదివాసీ మహిళలకు శుక్రవారం కుట్టుమిషన్లను సర్పంచ్‌లు ఐసరం హనుమంతరావు, సూరిబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవుల్లో సేకరించిన అడ్డాకులను మిషన్లు ద్వారా విస్తర్లు కుట్టి అధిక ఆదాయం పొందాలని వారు సూచించారు.వంజరి పంచాయతీ పినకిల్తారి గ్రామంలో అయిదు డ్వాక్రా గ్రూపు సంఘాలకు 10 కుట్టుమిషన్లను టీడీపీ నాయకుడు చిరంజీవినాయుడు అందజేశారు. ఉప సర్పంచ్, వెలుగుసీసీ, వీఏవోలు, మండల పీసా కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హామీలు అమలుచేయాలి



మాట్లాడుతున్న బుజ్జిబాబు

గూడెంకొత్తవీధి: పీఎం జన్‌మన్ గృహాలకు రూ.లక్ష అదనంగా ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు మాట నిలుపుకోవాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పాడేరు వస్తున్న సీఎం మాట నిలుపుకుని దానిని ప్రకటించాలన్నారు. ఆయన శుక్రవారం గిరిజనులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ గిరిజనులకు రూ.75 వేలు.ఆదివాసీలకు రూ లక్ష అదనంగా ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం వెంటనే అదనపు నిధులు విడుదల చేయాలన్నారు. జీవో నెంబర్ మూడుపై ప్రకటన చేయాలన్నారు. కొన్ని రోడ్లకు అటవీ శాఖ అభ్యంతరం చెబుతున్న నేపథ్యంలో వాటి నుంచి అడ్డంకులను తొలగించాలని కోరారు.

10న 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'



యెజ్జు వెంకటేశ్వరరావు

గంగవరం: ఎల్లవరంలో ఈనెల 10 ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ (అనంతబాబు), రంపచోడవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు యెజ్జు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

అడ్డతీగల: గంగవరం మండలం ఎల్లవరంలో ఆదివారం నిర్వహించనున్న బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి సమావేశం ఏర్పాటుచేస్తున్నామని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు), రంపచోడవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. ఈ సమావేశంలో అరకు ఎంపీ గుమ్మ తనుజారాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి ప్రసాద్ హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. నియోజవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు , కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని అనంతబాబు, నాగులపల్లి ధనలక్ష్మి పిలుపునిచ్చారు.

సీపీఎం సభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

చింతపల్లి: అల్లూరి జిల్లా రంపచోడవరంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకరి విష్ణుమూర్తి కోరారు.మండల కార్యదర్శి పోతురాజు అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా మహాసభల పోస్టర్‌ను విడుదల చేశార. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యుడు సత్తిబాబు, నాయకులు షేక్ రెహమాన్(బుజ్జి), రమణ, కుజ్జన్న, చిన్నారావు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం పూజలు



ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

జి.మాడుగుల/అడ్డతీగల: శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వరలక్ష్మి ప్రతిమలతో పాటు చిత్రపటాలు, అమ్మవారి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించారు. పిండి వంటలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో వరలక్ష్మి అమ్మవారికి పూజా కార్యక్రమాలు పవనగిరి వ్యవస్థాపకుడు తణుకు వెంకట్రామయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

రోగులకు మెరుగైన వైద్యం

చింతపల్లి: చింతపల్లి ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలంచించేందుకు రోగులు ఆధార్, ఆరోగ్య శ్రీకార్డులు విధిగా తీసుకురావాలని ఆరోగ్య శ్రీ ఇన్‌చార్జి డాక్టర్ రమేష్ అన్నారు.

ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ కార్యక్రమాన్ని అమల్లోకి తీసుకువచ్చిన సందర్భంగా రోగులకు ఆధార్ ఆధారంగా రోగులకు అభా(ఏబిహెచ్ఏ)నంబరును ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ నెంబరు ద్వారా రోగులకు ఏరియా ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందించే అవకాశం ఉంటుందన్నారు. ఆయా కార్డులు లేకపోవడం వలన గిరిజన రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు శాంకేతిక పరమైన సమస్యలు ఎదురౌతున్నాయని తెలిపారు. గిరిజనులకు ఆయా కార్డులు అందించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

విభిన్నం... గిరిజనుల జీవనం



అడ్డాకులను సంతకు మోసుకు వెళ్తున్న గిరిజనులు

సాక్షి, పాడేరు: అడవిలోనే పుట్టి అడవినే నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీలు మూలవాసులుగా పేరొందారు. గిరిజనుల జీవన విధానమంతా విభిన్నంగానే ఉంటుంది. వివిధ జాతుల గిరిజనులంతా ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారం. అటవీ ఫలసాయం సేకరణ సంతల్లో అమ్మకాలు, కొండపోడు గతంలో ప్రధానంగా ఉండేది. కాలక్రమేణా గిరిజనులంతా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో రాణిస్తున్నారు. పోడు వ్యవసాయం తగ్గింది. కాఫీ పంట అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది. లక్షా 50వేల ఎకరాల్లో గిరిజనులు కాఫీ పంటను సాగు చేస్తుండగా ఏటా 17వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజలను మార్కెట్ చేస్తున్నారు. అంతరపంటగా మిరియాలు కూడా గిరిజన రైతులకు మంచి ఆదాయాన్నిస్తుంది. ఉద్యాన వన పంటల సాగుకు మన్యం పేరొందింది. అలాగే విద్యా కార్యక్రమాలు విస్తృతమవడంతో గిరిజనుల్లో అక్షరాస్యత శాతం పెరిగింది. రోడ్డు, రవాణా, కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగుపడింది. ఆదివాసీ ప్రజలంతా తమ ఆచార సంప్రదాయాలను కొనసాగిస్తునే ఉన్నారు. కేవలం పూసల్నే దుస్తులుగా ధరిస్తూ జీవిస్తున్న ఆదివాసీలు ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంతంలో నేటికి జీవిస్తున్నారు. క్రమేపి కాలం మారుతున్నప్పటికి వీరి జీవన విధానం, ఆచార సంప్రదాయ సంస్కృతిని పాటిస్తూ జీవన మనుగడ సాగిస్తున్నారు. ప్రకృతితో మమేకమై స్వచ్ఛమైన మనస్సుతో జీవించే మనుషులు బోండా జాతి ఆదివాసీలు ఏవోబీ సరిహద్దు ప్రాంతమైనా ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లాకు చెందినా అంద్రహల్, ఒనమనాల్ గిరిజన గ్రామాల్లో నివసిస్తున్నారు. కాలక్రమేణా గిరిజన జీవన విధానం మారుతూ వస్తోంది. ఆదివాసీల అభ్యున్నతి కోసం స్వచ్ఛంద సంస్థలు విశేషంగా కృషి చేస్తున్నారు. ప్రతి ఏడాది ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటారు.